02092024-DIS-04_Layout 1 9/2/2024 3:03 AM Page 1

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

మీది మీదే! మాది మాదే!!

సాహిత్యంలో 'తెలుగు' పేరుతో 'ఆంధ్రా' ఆధిపత్యం ఇకపై చెల్లదు!

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవం కోసమే కాదు, భాషా, సాహిత్యరంగాల్లో ఆంధ్రాధిపత్యం, వివక్షకు వ్యతిరేకంగా కూడా జరిగింది. సంస్కృతి పరిరక్షణ కోసం, అన్నిరంగాల్లో హక్కుగా దక్కాల్సిన న్యాయమైన వాటా కోసం ఈ పోరాటం సాగింది.

60 ఏండ్ల పోరాట ఫలితంగా తెలంగాణ రాష్ట్రం సాకారమైంది. అయినా ఇప్పటికీ 'తెలుగు భాష', 'తెలుగుదనం', 'తెలుగు సంస్కృతి', 'ఉమ్మడి వారసత్వం' ఇలా పలు పేర్లతో ఆంధ్రాధిపత్యం, పెత్తనం, దాష్టీకం, వివక్ష ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. కేంద్ర సాహిత్య అకాడమీ కమిటీల నియామకాల్లోనూ, నిర్వహణలోనూ, తెలుగులో రాసే సాహిత్యకారులకు ఇచ్చే కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుల్లోనూ, ఆంధ్రా సాహిత్యకారులు 'తెలుగు' పేరిట వెలువరించే సంకలనాల్లోనూ, నిర్వహించే రైటర్స్ మీట్‌లు, లిటరరీ ఫెస్టివల్స్, సంస్థల సభలు, కళాశాలల సదస్సులు, సమావేశాల్లోనూ, కొన్ని ప్రచురణా సంస్థలు ముద్రించే పుస్తకాల విషయంలోనూ ఈ వివక్ష ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది.

తెలుగు పత్రికల్లోని సాహిత్యపేజీల్లో అచ్చయ్యే కవిత్వం, విమర్శ, పరామర్శ, పరిచయాలు, సమీక్షలు అన్నీ కూడా ఒక ప్రాంతానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి మరొక ప్రాంతానికి కనీస ప్రాతినిధ్యాన్ని నిరాకరిస్తున్నాయి. ఒక పద్ధతి ప్రకారం తెలంగాణవారిని, వారి ప్రతిభను ద్వితీయ శ్రేణిదిగా నిర్ధారిస్తున్నారు.

తెలంగాణ ఉద్యమంలో ఆత్మగౌరవ నినాదం ప్రధానమైంది. 90 ఏండ్ల కింద 'తెలంగాణలో కవులు పూజ్యం' అని విమర్శ వస్తే, 'తెలంగాణలో కవులు పూజ్యం కాదు. పూజనీయులు' అని సుర వరం ప్రతాపరెడ్డి 'గోలకొండ కవుల సంచిక'ను 369 కవులతో వెలువరించారు. ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తూ తెలంగాణ ఉద్యమ సందర్భంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలవారు ఇబ్బడిముబ్బడిగా సాహితీ సృజన చేసిండ్రు. లెక్కకు మించి సంకలనాలు వెలువరించిండ్రు. ప్రపంచంలో మరే ఉద్యమంలో రానన్ని పాటలు, కవితలు, విమర్శలు, వ్యాసాలు, చారిత్రక వ్యాసాలు ఈ ఉద్యమ సందర్భంగా వచ్చాయి. అయినా ఆంధ్రాధిపత్యం తమ వివక్షాపూరిత దృష్టితో ఈ సాహిత్యానికి విలువ కట్టడానికి నిరాకరించింది.

అయితే మొన్నటి జూన్ 2 (2024) వరకు అధికారికంగా హైదరాబాద్ నగరం ఆంధ్రప్రదేశ్-తెలంగాణ రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా ఉండింది. దానివల్ల తెలంగాణ వాదులు తమ హక్కులను గట్టిగా చాటిచెప్పడానికి కొంత ప్రతిబంధకాలుండేవి. అదే సమయంలో ఆంధ్రాధిపత్యం, లాబీయింగ్ విస్తరించింది. ఈ ఆధిపత్యం నిత్యం రెండింతలవుతున్నందుకే మరోసారి నీళ్లు, నిధులు, నియామకాల మాదిరిగానే 'సాహిత్యం'లోనూ సమానమైన వాటా దక్కాలని నినదిస్తున్నాం. ఇప్పుడు హైదరాబాద్ కేవలం తెలంగాణ ప్రజల ఆస్తి. ఇక్కడ జరిగే ప్రతి ప్రభుత్వ సాహిత్య కార్యక్రమాల్లో పూర్తిగా తెలంగాణవారికే ప్రాతినిధ్యం ఉండాలి. ఆంధ్రా ప్రాంతంలో ఎక్కడ సభలు నిర్వహించినా కేవలం ఆ ప్రాంతం వారినే కేంద్ర సాహిత్య అకాడమీ అతిథులుగా, పత్రులుగా అవకాశం కల్పిస్తున్నది. హైదరాబాద్‌లో సభలు జరిపినా అదే ఆంధ్రావారినే ప్రధానంగా ఆహ్వానిస్తున్నారు. దీనివల్ల అక్కడా, ఇక్కడా.. రెండు ప్రాంతాల్లోనూ ఆంధ్రావారి పెత్తనమే సాగుతున్నది.

కేంద్ర సాహిత్య అకాడమీ ఇచ్చే అవార్డుల్లోనూ ఇదే వివక్ష కొనసాగుతున్నది. 2014 నుంచి 2023 వరకు మొత్తం 11 మందికి తెలుగులో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులు ప్రకటిస్తే అందులో నిఖిలేశ్వర్, గోరటి వెంకన్న మాత్రమే తెలంగాణవాళ్లు. మిగతా 9 మంది ఆంధ్రా, రాయలసీమవాళ్లే. అంటే తెలుగు పేరిట తెలంగాణవారిని ఎలాంటి దగా చేస్తున్నారో అర్థమవుతున్నది.

'కవి సంధి'లో కూడా ఇలాంటి వివక్ష జరుగుతున్నది. అకాడమీ నిర్వహించే అన్ని సభలు ఇట్లాగే మిగులుతున్నాయి. అవార్డుల గురించి గట్టిగా నిలదీస్తే ఇది 'తెలుగు' సాహిత్యంలో ప్రతిభ చూపించేవారికి ఇస్తారని చెప్పున్నారు. పరోక్షంగా తెలంగాణలో అవార్డుకు యోగ్యులైన సాహితీవేత్తలు లేరని తేల్చిచెప్పున్నారు.

'తెలుగు కథలు', 'కవిత్వం', 'యువ కథకులు' (విమర్శ) పేరిట ఆంధ్రా సాహిత్యానికి పెద్దపీట వేస్తున్నారు. తద్వారా తెలంగాణలో సాహిత్యం లేదని సంకేతిస్తున్నారు. వాళ్ల సంకలనాలు వాళ్లిష్టమొచ్చినట్లు వేసుకోవచ్చు, అభ్యంతరమేమీ లేదు. కాకపోతే ఆ సాహిత్యాన్ని 'తెలుగు' పేరిట కాకుండా 'ఆంధ్రా' పేరుతో వేసుకున్నట్టయితే సంతోషం. అట్లా కాకుండా ఏ ఒక్కరో, ఇద్దరో తెలంగాణవారికి ప్రాతినిధ్యం కల్పించి అది మొత్తం తెలుగువారి ప్రాతినిధ్య సంకలనం, సభ, ఫెస్టివల్, అవార్డు అంటే ఇకముందు చెల్లదు. మేము ఈ నిర్ణయం తీసుకోవడానికి గత పదేండ్ల అనుభవాలు నేర్పిన గుణపాఠాలే కారణం. కుట్రలు, మోసాలు, అన్యాయాలను ఎన్నో ఎదుర్కొన్నాం. ఆంధ్రా ప్రాంతానికి చెందిన సాహితీ లబ్ధప్రతిష్టులు ఒక పథకం ప్రకారం తమ వారికి మాత్రమే ప్రాతినిధ్యం కల్పిస్తున్నారు. అది సంకలనాల కూర్పులో కావొచ్చు, విమర్శ పేరిట వెలువరించే వ్యాస సంపుటాలు కావొచ్చు, అవార్డులు కావొచ్చు, సభలు, సదస్సులు, లిటరరీ మీట్స్, ఫెస్టివల్స్ కావొచ్చు, ప్రచురణలు కావచ్చు. వీటిలో వేటిలోనూ తెలంగాణవారికి న్యాయమైన ప్రాతినిధ్యం లేకుండా, అసలు తెలంగాణలో సాహితీవేత్తలే లేరనే అభిప్రాయం పాదులూనుకునేలా వ్యవహరిస్తున్నారు. అందుకే ఈ ధిక్కారం.

మీది ఆంధ్రా సాహిత్యం. మీరు ఆంధ్రా సాహిత్య చరిత్ర నిర్మించుకుంటున్నారు. సంతోషం. మీ సాహిత్యం క్యారెక్టర్ వేరు, నేచర్ వేరు, ఫంక్షన్ వేరు, బిహేవియర్ వేరు, లక్ష్యం వేరు. కాబట్టి, మీరు వేరు, మేం వేరు. మా సాహిత్యం మాది. మా ఆత్మగౌరవం మాది. ఇప్పటికే చాలాసార్లు చెప్పాం. అయినా, మేం ఇలాగే చేస్తామంటూ సిగ్గు విడిచి అవే పనులు పదేపదే చేస్తున్నారు. కాబట్టి, మీ కథలు, కవిత్వాన్ని 'ఆంధ్రా' పేరిట అచ్చేసుకుంటే మాకేం అభ్యంతరం ఉండదు. ఇదొక్కటే ఆంధ్రాధిపత్యాన్ని నిలువరించగలదని విశ్వసిస్తున్నాం. రాష్ట్రాలు విడిపోయిన పదేండ్ల తర్వాత ఒక విస్పష్ట ప్రకటన చేస్తున్నాం. ఎందులోనైనా ఆంధ్రా రిప్రజెంటేషన్, తెలంగాణ రిప్రజెంటేషన్ విడిగా ఉండాలి. కాబట్టి ప్రభుత్వాలకు, సంస్థలకు, కేంద్ర సాహిత్య అకాడమీ వారికి చెప్పేదేమంటే తెలుగు అనే భాషా ప్రాతిపదికన కాకుండా రాష్ట్రాల ప్రాతిపదికన రిప్రజెంటేషన్ ఇవ్వండి. తెలుగు సాహిత్యం అనే చర్చ పెట్టినా.. తెలంగాణ సాహిత్యం, ఆంధ్రా సాహిత్యం వేరుగా పెట్టవలసిందే. ఎందుకంటే అవి వేర్వేరు కాబట్టి. తెలంగాణకు ప్రత్యేకంగా ఆహ్వానం ఉండాల్సిందే.

అట్లాగే కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు కన్వీనర్లు ఒకసారి ఆంధ్రావారుంటే, మరోసారి తెలంగాణవారుండాలి. రొటేషన్ పద్ధతిలో మారాలి. అంతేకాకుండా అవార్డులు సైతం ఒక సంవత్సరం తెలంగాణవారికిస్తే, మరుసటి సంవత్సరం ఆంధ్రా/ రాయలసీమ వారికివ్వాలి.

కేంద్ర ప్రభుత్వం తెలుగు వారందరికీ కలిపి ఏర్పాటుచేసిన 'ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం' కార్యక్రమాల్లో తెలంగాణ ప్రాతినిధ్యం నామమాత్రంగా ఉంటున్నది. తగిన ప్రాతినిధ్యం ఉండాలి. అసలు తెలంగాణ సాహిత్య ప్రాచీనత వల్లే తెలుగుకు ప్రాచీన హోదా లభించిందన్న విషయం గుర్తుంచుకోవాలి.

తెలంగాణలో ఉన్న వాగ్గేయకారులు, చిందు, డక్కలి, బైండ్ల తదితర కళలు వేరు. గొప్పవైన ఈ కళారూపాలను కూడా సాహిత్యంలో భాగంగా చూడాలి. ఆ కళల్లోనే బతుకుతున్న ఆ ఫోక్ ఆర్టిస్టులను గుర్తించి వారిని గౌరవించుకోవడం, వారికి డయాస్ ఇవ్వడం, అతిథులుగా పిలవడం ఆంధ్రావారి వల్ల కాదు. అది తెలంగాణవారు మాత్రమే చేసుకోగలరు. కాబట్టి 'తెలుగు' పేరిట మొత్తంగా కొనసాగుతున్న ఆంధ్రాధిపత్యానికి ఇక తెరదించాల్సిందే! ఇప్పటినుంచి మా ప్రాతినిధ్యాన్ని లాక్కుంటే సహించేది లేదు. 'ఇక మీది మీదే! మాది మాదే!!' ఇక మీ సభలు, మీ కార్యక్రమాలు కావాలంటే ఆంధ్రాలో చేసుకోండి. ఇక చాలు మీరు చేసిన నిర్వాకం. మా సాహిత్యం మేం ప్రచురించుకుంటాం. మా సభలు మేం చేసుకుంటాం. ఇక చాలని తేల్చిచెప్తున్నాం.

సోదరభావం ఉంటే గింటే మా రచయితలను మీరు, మీ రచయితలను మేం అతిథులుగా పిలుచుకుందాం. దానికెవరూ అడ్డు చెప్పరు. ఈ వివక్షలకు, ఆధిపత్య పోకడలకు వ్యతిరేకంగా నిరసనలు జరిగే దాకా లాగవద్దని కోరుతున్నాం.

– డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్, వఝుల శివకుమార్, డాక్టర్ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, దేశపతి శ్రీనివాస్, జూలూరి గౌరీశంకర్, అఫ్సర్, అన్నవరం దేవేందర్, డాక్టర్ జిలుకర శ్రీనివాస్, స్కైబాబ, డాక్టర్ పసునూరి రవీందర్, డాక్టర్ నాళేశ్వరం శంకరం, పెద్దింటి అశోక్‌కుమార్, డాక్టర్ ఉదారి నారాయణ, ప్రొఫెసర్ పులికొండ సుబ్బాచారి, అన్వర్, దాసోజు లలిత, గుడిపల్లి నిరంజన్, కుంజ కళ్యాణి, బిల్లా మహేందర్, పొట్లపల్లి శ్రీనివాసరావు, వనపట్ల సుబ్బయ్య, నరేష్‌కుమార్ సూఫీ, తైదల అంజయ్య, గాజోజు నాగభూషణం, కూకట్ల తిరుపతి, డాక్టర్ పొన్నాల బాలయ్య, బూర్ల వెంకటేశ్వర్లు, విలాసాగరం రవీందర్, కందుకూరి శ్రీరాములు, కోట్ల వెంకటేశ్వరరెడ్డి, వేముగంటి మురళి, దాసోజు కృష్ణమాచారి, ఘనపురం దేవేందర్, రేడియం, కాంచనపల్లి గోవర్ధన్ రాజు, పెనుగొండ బసవేశ్వర్, డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, ఎదిరెపల్లి కాశన్న, అవనిశ్రీ, నాగవరం బాల్‌రాం, బైరెడ్డి కృష్ణారెడ్డి, అంబటి వెంకన్న, డాక్టర్ గాదె వెంకటేష్, డాక్టర్ కటుకోజ్వల రమేష్, రూపా రుక్మిణి, తోకల రాజేశం, బోల యాదయ్య, మోత్కూరు శ్రీనివాస్, గోవింద్ గోవర్ధన్, విఠలాపురం పుష్పలత, పెరుమాండ్ల రాము, డాక్టర్ వెల్దండి శ్రీధర్, శ్రీశైలంరెడ్డి పంజుగుల, తండు కృష్ణ కౌండిన్య, పరిమళ్, ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్, వి.శంకర్, దాస్యం సేనాపతి, తూర్పు మల్లారెడ్డి, రాజు దుర్గాని, జి.ఎన్.స్వామి, మద్దెర్ల రమేష్, గంద్ర లక్ష్మణరావు, కె.వీరయ్య.

పాత అంగీ...

"Old is gold" అన్న పాత సామెతను
నిజం చేస్తూ ఈ పాత అంగీ
ఇంతకాలం వదలకుండా నన్నంటిపెట్టుకునే వున్నది
తాను వదలకుండా వున్నదా,
నేను వదలకుండా వున్నానా? అదొక పెద్ద ప్రశ్న?
కాలేజీ రోజుల్లోనే మా మధ్య అల్లుకున్న బంధం
చదువు పూర్తయి ఉద్యోగం దొరికినా,
పెళ్లయి పిల్లల తండ్రినయ్యాక కూడా
వదలక నా ఒంటిని అంటిపెట్టుకునే వుంది!
సంవత్సరాలు దాటినా ఒక్క చిరుగు లేదని,
కాంతి తగ్గ లేదని నా వాదన
సమయాన్ని బట్టి పొట్టిగా, పొడవుగా మారుతుంది
నాలాగే ఒదిగి వుండే గుణం
'ఇంకెంతకాలం వుంచుకుంటావ్,
వదిలెయ్యి దాన్ని' అని ఇంటావిడ
మందలించినపుడో, అరచినపుడో,
విసుగుతో చిరాకు పడుతున్నపుడో నాకనాలనిపిస్తుంది
'నీకంటే ముందే దీన్ని కట్టుకున్నాను, దీన్ని వదిలేస్తే,
తరువాత నీ వంతు వస్తుందేమోనని భయం' అన్నాను.
అర్థం కాని చూపులతో నన్నొక పాత అంగీలా తీసి పారేస్తుంది
ఐనా కొక్కానికి పాత అంగీ,
మంచానికి నేను అతుక్కుపోయే వుంటాము!
ఇద్దరిదీ ఒకే మాట, ఒకే బాటలా అవసరానికి ఒక్కటవుతాం
అడవులు తిరిగినా, కొండలు,
గుట్టలెక్కినా పాత అంగీ నా తోడుగానే ఉండాలి
నా వొంటి మీదున్నంత సేపు ఎంతో ధైర్యం.
అడవిలో ముళ్లపొదల నుంచి,
నగరంలో ధూళి, మురికి నుంచి కాపాడే రక్షణ కవచం అది...



డాక్టర్
రూప్‌కుమార్ డబ్బీకార్
91778 57389

నా మాట జ్ఞాపకాల మూట

"A Story Should have a beginning, middle and an end, but not necessarily in that order" అని Jean Luc Godard ఒకచోట అన్నాడు. అది ఆత్మ కథలకు, జ్ఞాపకాలకు కూడా వర్తిస్తుంది.

డైరీ రాయడం వేరు, జ్ఞాపకాలు రాయడం వేరు. ఎందుకంటే డైరీ ఏ రోజుకారోజు తేదీల వారీగా రాస్తాం. ఆయా సమయాల వారీగా జరిగిన విషయాలను రాస్తూ పోవాలి. అందులో సందర్భాలు, సంఘటనలుంటాయి. వరుసగా క్యాలెండర్ల లాగా రాస్తూ పోవాలి. కానీ, జ్ఞాపకాలు అట్లా కాదు. జ్ఞాపకాలను రాయడం మొదలుపెట్టగానే ఆయా కాలాల నాటి అనుభవాలు, అనుభూతులు జ్ఞాపకాలై మనల్ని ముప్పిరిగొంటాయి, మేమున్నామంటూ మన ముందు వాలతాయి. నేనంటే నేనని మనల్ని చుట్టేసుకుంటాయి. తేదీల వారీగా కాదు కాని తన్నుకొస్తున్న జ్ఞాపకాలు నేనంటే నేనేనని మన లోపలి నుంచి తోసుకొస్తాయి. అప్పుడు వాటిని మనం స్థిరంగా ఒక చోట నిలబడి సంయమనంతో రాయాల్సి ఉంటుంది. అక్కడ ఉద్వేగం, ఉద్రేకం కూడదు. అట్లా రాసినప్పుడే ఆ జ్ఞాపకాలు సజీవంగా ఉండి సాధికారికతను సంతరించుకుంటాయి.

నిజానికి జ్ఞాపకాల్లో 'కాలం' ఒకింత సంక్లిష్టమైన పాత్రను పోషిస్తుంది. అది ముందుకు, వెనక్కూ సాగుతుంది. అంతే కాదు, అప్పుడప్పుడు గుండ్రంగా కూడా తిరుగుతుంది. అంతేకాదు, ఆ 'కాలం' పొరలు పొరలుగా మన ముందు ఆవిష్కృతమవుతుంది. అట్లా ఆయా కాలాల్లో సాగిన మన జీవన ప్రవాహంలో అనేక గెలుపులు, ఓటములు, అభినందనలు, అవమానాలూ అన్నీ ఎదురవుతాయి. వాటి ప్రభావాలూ స్పష్టంగా కళ్లముందు కదలాడతాయి. కొన్ని మనలను సంబురపెడతాయి, మరికొన్ని కొండకచో బాధపెడతాయి. జ్ఞాపకాలు రాసేటప్పుడు వాటన్నింటినీ నిర్వ్యంద్వంగా నిష్పక్షపాతంగా రాయాలి. ఎప్పుడైనా ఆబ్జెక్టివ్‌గా రాయడం వల్లనే ఆ జ్ఞాపకాలకు, ఆ రచనకు సాధికారికత ఏర్పడుతుంది.

జ్ఞాపకాలు, ఆత్మకథలు ఎప్పుడైతే భేషజాలు లేకుండా నిజాయితీగా శ్వేతపత్రాలుగా రాస్తామో అవి గొప్ప ప్రేరణనిస్తాయి, ఆనందాన్నిస్తాయి. ఆ విశ్వాసంతోనే నేను నా ఈ 'యాదోంకీ బారాత్' (జ్ఞాపకాల ఊరేగింపు)ని రాయడం మొదలుపెట్టాను.



***

'లోపల జ్ఞాపకాల జాతర/ నేనేమో వర్తమాన జెండా పట్టుకుని ముందు నడుస్తున్నా' అనుకుంటూ రాయడం మొదలుపెట్టాను. తేదీల వారీగా రాయడం కాదు కానీ, మొత్తమ్మీద ఏదో ఒక క్రమంలో రాయాలనుకున్నాను. ఎప్పటికప్పుడు నన్ను నేను సమన్వయించుకుంటూ, పుటం బెట్టుకుంటూ రాయడం మొదలుపెట్టాను.

మూడేండ్ల కిందట మా కరీంనగర్ ఇంట్లో నేను జరిపిన పాత పుస్తకాల తవ్వకాల్లో బయటపడ్డ ఒక చిన్న ఫొటో అప్పుడు ఓ నాలుగు జ్ఞాపకాలను రాసేందుకు కారణమైంది. చారిత్రకంగా రికార్డ్ చేయాల్సిన విషయమనిపించి ఈ జ్ఞాపకాలను రాసి పంచుకున్నాను. అది చదివిన నా సహచరి ఇందిర 'జ్ఞాపకాలు చాలా బాగున్నాయి... అప్పటి అన్ని విషయాలను రాయకూడదా' అంది. అంతే కాదు, ఒకరకంగా ఒత్తిడి తెచ్చింది. చిన్నప్పటి నుంచీ అన్ని విషయాలను రాస్తే అది ఆత్మకథ అవుతుంది, మనం ఆత్మకథ రాసేంత పెద్దవాళ్లం కాదులే అన్నాను. కానీ, తను ఊరుకోలేదు. 'అన్ని వివరాలను రాయండి... చదివేవాళ్లు చదువుతారు... ఏముంది' అన్నది తను. ఇంకేముంది నాలో కూడా రాయాలనే కోరిక పెరిగింది. ఎప్పుడో ఇంటర్‌లో ఉన్నప్పుడు చూసిన హిందీ సినిమా పేరు 'యాదోంకీ బారాత్' గుర్తొచ్చింది. ఆ పేరు మీదే వారం వారం రాయడం మొదలుపెట్టాను. సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, వాట్సాప్, నా word press పేజీల్లో రాయడం మొదలుపెట్టాను. 'మిత్రులు బాగుంది, కొనసాగించ'మన్నారు. అది అట్లా సాగుతూ వచ్చింది.

నా ఈ 'యాదోంకీ బారాత్'లో విజయాలే కాదు, నా ఓటములు, నేను ఎదుర్కొన్న అవమానాలు, నాకు జరిగిన నష్టాలూ అన్నీ రాశాను. చీకటి, వెలుతురు అన్నింటినీ చిత్రించాను. మన జీవితంలో ఎన్నెన్ని తీరాలని దాటుతామో, ఎంతెంత దూరం ప్రయాణిస్తామో.. ఎన్నో గుర్తుంటాయి, మరెన్నో మరుపు అరల్లో మిగిలిపోతాయి. దాదాపుగా అన్నింటినీ రాసినప్పుడు దగ్గరి వాళ్లనుంచే రెండు వాదాలు వివాదాలు ఎదురవుతాయి. 'నీకు నేను ఇంత దగ్గరివాడిని కదా నా గురించి చాలా తక్కువ రాశావు' అని ఒకటి, ఇక రెండవది 'కొన్ని విషయాలను రాయాల్సింది కాదు, ఎడిట్ చేస్తే బాగుండేది' అని. ఇవన్నీ ఎట్లా ఉన్నా నేను నా జ్ఞాపకాలను నా శక్తి మేరకు నిజాయితీగా, వాస్తవికంగా రాశాను. నా ఈ 'యాదోంకీ బారాత్' రాస్తున్నంత కాలమూ నాలో నేను నవ్వుకున్నాను, ఏడ్చాను, కాలరెగరేసుకున్నాను, కొన్నిసార్లు తల దించుకున్నాను.

ఇదంతా కేవలం నా గడిచిన జీవితాన్ని గుర్తుచేసుకోవడమే కాదు, అది కచ్చితంగా తిరిగి జీవించడమే. ఇందులో నా జీవితానుభవాలతో పాటు ఆయా కాలాలనాటి రాజకీయ, సామాజిక అంశాలూ, వాతావరణమూ ప్రతిబింబించాయి. తారీఖులు, దస్తావేజులూ కాదు గానీ నా జ్ఞాపకాల నేపథ్యంలో ఇది ఒకరకంగా సాహిత్య, సామాజిక, సాంస్కృతిక చరిత్రే అని అనుకుంటాను.

వారాల ఆనంద్
9440501281

('యాదోంకి బారాత్' పుస్తకానికి రచయిత రాసుకున్న ముందుమాట నుంచి..)

అమ్మ స్పర్శ

మాటలు నేర్చినప్పటి నుంచీ
మాట్లాడుతూనే వున్నాను.
కొంత ధ్వనిగా
మరికొంత ప్రతిధ్వనిగా.
పునరుక్తులు కావవి
ఒక అనంత సంభాషణలో భాగం.

చూడటం తెలిసినప్పటి నుంచీ
చూస్తూనే వున్నాను
ఇష్టమైందే చూసే ఛాన్స్ లేదు
కనిపించినవే చూస్తున్నాను
అవి అపారదృశ్యంలోని కొన్ని శకలాలు.

వాసన తెలిసినప్పటి నుంచీ
ముక్కు లెగరేస్తూనే వున్నాను
పరిమళం కావొచ్చు
మరోటి కావచ్చు
మనిషి వాసన మాత్రం
అలవాటు కాలేదు.

స్పర్శ అమ్మతోనే మొదలైంది
అన్ని ఇంద్రియాలూ
దానిలో మిళితమై వున్నాయి.
మరి మనస్సో!?
అది అర్థమైతే ఇలా వుండను
కవిత్వం అబ్బినందుకే
నాకు కొంత
అమూర్త జీవితం మొదలైంది.



డాక్టర్ ఎన్.గోపి
93910 28496

అమ్మకో లేఖ

తెల్లారకముందే సూర్యుడ్ని
నీ కళ్లల్లో వెలిగించుకొని నిద్ర లేస్తావ్!

నువ్వలా పక్కమీది నుంచి లేచి కూర్చొని రాత్రి తలకింద మెత్త లేక చేతినే మెత్తగా పెట్టుకొని పడుకున్నందుకు పాయలుగా విడిపోయిన జుట్టును ముడేసుకొని కొప్పు పెట్టుకుంటుంటే మన ఊరి చెరువులో బుంగపడి నీళ్లు సుడులు తిరుగుతున్నట్టు ఎంత సక్కగుంటదోనే నిన్నట్ల సూస్తే!

ఇగ సిన్నగా నువ్వు పైటకొంగును సర్దుకొని పొరకొట్ట చేతుల పట్టుకుంటే ప్రపంచాన్ని శుద్ధిజేసే పారిశుద్ధ్య కార్మికురాల్లెక్కనే నా కండ్లల్ల నువ్వు తిరుగుతవమ్మా!!

ఇగ నువ్వు రోజు పోసే బియ్యపు నీళ్లకు బదులుగా దాసరిద్ద మ్మమ్మోల్ల బర్ల కొట్టం నుండి నీ రెండు చేతులతో పెండను తీసుకొచ్చి నీళ్లల్లో కలిపి నువ్వు అలుకేస్తావుంటే అయుర్వేదాన్నీ నీ చేతుల్లోని లోటతో ఈ ప్రపంచం ముందు సల్లి గత్తర రాకుండా చేసే డాక్టర్ లెక్కనే కనిపిస్తవమ్మా!!

నువ్వు అలుకేసినంక వాకిలి మొత్తం
చిలుకల గుంపు కూసున్నట్టే ఉంటదే అమ్మా!
ఆ అలుకేసిన పెండ భూమిని కౌగిలించుకున్న
ఘడియేందో తెల్వదు కానీ ఒక కమ్మని వాసన
మన గుమ్మం
దగ్గర్నుండీ గూడెమంత వస్తది!!

ఇగ అలుకేసినంక అందంగా సుద్దతో పెట్టే ముగ్గంటే నాకు చాలా నచ్చుతదమ్మా!
నువ్వు చేతితో సుద్దపట్టి ముగ్గేస్తా వుంటే మట్టిపలక మీద పెద బాలశిక్షలో అఆలను దిద్దుతున్న పసిపాప లెక్కనే నాకగుపిస్తవమ్మా!

మన పందిరి పక్కన ఉన్న పులిసేరు చెట్ల పొదల్లో
నుంచి ఊరపిచ్చుకలు వాటి ఊపిరితో సప్పుళ్లను
చేస్తూ సూర్యుడికి రమ్మని ఆహ్వానం పంపుతాయి!

ఇగ నువ్వు పొయ్యి దగ్గరికి పోయి రాత్రి కాలిన కట్టెలకొచ్చిన బూడిదిని తీసి మన పెంటగడ్డల పారబోసొచ్చి ఈ రోజు బువ్వకూరలొండుదానికి మన మట్టిపొయ్యిని ఎంతో అందంగా ముస్తాబు చేస్తావ్!

నువ్వా మట్టిపొయ్యిని ఎర్రమన్నుతో గుడ్డపెట్టి
అలుకుతావుంటే పురాతన కట్టడాలకు రంగుల
ద్దుతున్న పెయింటర్ లెక్కనే అగుపిస్తవమ్మ నాకు!

ఇగ నువ్వు పాలచెంబు పట్టుకొని కత్తులెంకమ్మింటికి పోయి పది రూపాల పాలు పట్టుకొచ్చి చాయ్ చేసి చిన్నగ్లాసుల నిండా చాయ్ పెద్ద గ్లాసుల నిండా నీళ్లు పట్టుకొచ్చి ప్రేమతో నాకిచ్చి నువ్వొక గ్లాసుల చాయ్ తెచ్చుకొని మన గనవ దగ్గర మెట్ల మీద నువ్వు నేనూ కూసోని చాయ్ తాగుతూ నువ్వు నాకు చెప్పే నీ ముచ్చట్లు నువ్వు పెట్టిచ్చిన చాయ్ లెక్కనే ఎంతో కమ్మగుంటయమ్మా!!

ఇప్పుడు నా దగ్గర నువ్వు లేవు
ఇప్పుడు నీ దగ్గర నేనూ లేను!

నా దగ్గర నువ్వుంటే నీ కడుపు మీద చెయ్యేసుకొని నీ మీద కాళ్లేసుకొని పడుకునేటోడ్నమ్మ!!



కంబాలపల్లి
(మనోజ్ మాతంగి)
79957 72473

గులేర్

డాక్టర్
సదానంద్ శారద
98497 97459

ఓనగాయ
యాదికున్నద
గులేరు దెబ్బకు
టప టప రాలేయి

చింతకాయలు రాలేయి
చింతలు రాలలే...

చిన్నప్పుడు
గులేరు అతారె
పతారె పుట్టించేది
ఉత్తుత్తి భయమూ...

గులేరు
సూటి తప్పలే..
అసలు సూటి తెల్వకే
తిప్పలు..

చిన్న మైకులు
పెద్ద మైకులు
మొదలైతానై...

భూ సారం ఆకలి కేకలు సూటి
గొంతు గులేర్ల
మాటలు నింపుండ్రి..!!